సాక్షి ఒడిశా
శనివారం । 11 । అక్టోబర్ । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ. 6,36,164
బంగారం : 100 మిల్లీ గ్రాములు
వెండి : 21 గ్రాముల 500 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ

సీబీఐ దర్యాప్తు కోసం పిల్
ఎస్‌ఐ పోస్టుల కుంభకోణం మలుపులు తిరుగుతోంది. సీబీఐ దర్యాప్తు కోరుతున్నారు.
- 8లో



పంట నష్టం పరిశీలన
గుమ్మ బ్లాక్‌లో పంట నష్టం పరిశీలించారు. ఎమ్మెల్యే గ్రామమంతా తిరిగారు.
- 8లో

న్యూస్‌రీల్

చోరీ కేసుల్లో నిందితులు అరెస్టు



చోరీ కేసుల్లో అరెస్టైన నిందితులు

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వేర్వేరు చోరీ ఘటనలకు సంబంధించి ఇద్దరు నిందితులను గురువారం అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. నిందితుల నుంచి చోరీకి గురైన సామాన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 2వ తేదీన పోలమ పంచాయతీలోని కెందుగుడ గ్రామంలో ప్రశాంత్ కొరకొరియా అనే వ్యక్తికి సంబంధించిన జనసేవా కేంద్రంలో చోరీ జరిగింది. కేంద్రంలోని ల్యాప్‌టాప్, రెండు మానిటర్లు చోరీ చేశారు. దీనికి సంబంధించి బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా సునాఖండి పంచాయతీలోని జయరాం కులసిక అనే వ్యక్తి బైకు చోరీకి గురయ్యింది. ఈ రెండు కేసులకు సంబంధించి పోలీసులు దర్యాప్తు చేసి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు.

భారీగా గుట్కా నిల్వలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గుట్కా నిల్వలు

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల పోలీసులు ముందస్తు సమాచారంతో ఐఐసీ ధీరాజ్ పట్నాయిక్ ఆధ్వర్యంలో శుక్రవారం భారీగా గుట్కా నిల్వలు స్వాధీనం చేసుకున్నారు. సాయంత్రం సమయంలో బలిమెల మార్కెట్‌లో ఉన్న టి.మురళీధర్ పాత్రో దుకాణంపై దాడి చేశారు. దీనిలో భాగంగా దుకాణం వెనుక గోదాములో నిల్వ ఉంచిన గుట్కా స్వాధీనం చేసుకున్నారు. దీనివిలువ రూ.లక్షకు పైగా ఉంటుందని అంచనా. మురళీధర్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

పడవ బోల్తా

- 8 మంది మత్స్యకారులు సురక్షితం

భువనేశ్వర్: కేంద్రాపడా జిల్లా రాజ్‌నగర్ సతాభయా సమీపం సముద్ర తీరంలో ఒక పడవ బోల్తా పడింది. అందులో 8 మంది మత్స్యకారులు ఉన్నారు. అదృష్టవశాత్తు ప్రాణాపాయం నుంచి తప్పించుకుని ఈదుకుంటూ సురక్షితంగా తీరం చేరి బతికి బట్ట కట్టారు. ప్రమాదం నుంచి బయట పడిన వారంతా భద్రక్ ప్రాంతీయ మత్స్యకారులు. సతొభయా సమీపం సముద్ర తీరంలో ఉండగా సాంకేతిక లోపాన్ని గమనించారు. సమయస్ఫూర్తితో పడవలోని మత్స్యకారులు స్పందించి ప్రాణాలను కాపాడుకున్నారు. సకాలంలో పడవను తీరం వైపు మళ్లించడానికి ప్రయత్నించారు. ఇంతలో పడవలో ఒక భాగం విరిగిపోవడంతో పడవలోకి నీరు వేగంగా చొచ్చుకుపోయింది. పడవ మునగక ముందే సముద్రంలోకి దూకి ఈదుకుంటూ మత్స్యకారులు సురక్షితంగా ఒడ్డుకు చేరడంతో ఘోర ప్రమాదం తప్పింది.

భార్యను చంపి.. ప్రమాదంగా చిత్రించి

- కొరాపుట్‌లో శ్రీకాకుళం జిల్లా టెక్కలి యువతి హత్య



కొరాపుట్ పోలీస్ స్టేషన్ ముందు టెక్కలి వాసులు



భార్య ప్రియాంక పండాతో శివ శంకర్ పాత్రో

కొరాపుట్: భార్యను చంపేసి.. ప్రమాదంగా చిత్రించాడో ప్రబుద్ధుడు. ఆయన పోలీసు కావడం విశేషం. కొరాపుట్ జిల్లా కేంద్రంలో ఓఎంపీ కాలనీలో ఐఆర్‌బీ జవాన్ శివ శంకర్ పాత్రో నివాసంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగి అతని భార్య ప్రియాంక పండా మృతి చెందిన విషయం పాఠకులకు తెలిసిందే. అందరూ ఇది ప్రమాదమే అని అనుకున్నారు. కానీ ప్రియాంక తల్లిదండ్రులు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా టెక్కలి నుంచి కొరాపుట్‌లో సంఘటన స్థలానికి చేరుకున్న తర్వాత కేసు మలుపు తిరిగింది. వారు తమ కుమార్తె మృతదేహం చూసి అనుమానం వ్యక్తం చేయడంతో అసలు విషయం బయటపడింది. ప్రస్తుతం నిందితుడిని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..

శ్రీకాకుళం జిల్లా టెక్కలి పెద్ద బ్రాహ్మణ వీధికి చెందిన తరణి పండా తన కుమార్తె ప్రియాంకని నబరంగ్‌పూర్ జిల్లా డాబుగాంకి చెందిన ఐఆర్‌బీ కానిస్టేబుల్ శివ శంకర్ పాత్రోకి ఇచ్చి గత ఏడాది జులై 11న టెక్కలిలో వివాహం జరిపించారు. వివాహ సమయంలో 12 తులాల బంగారం, రూ.2 లక్షల నగదు వరకట్నంగా ఇచ్చారు. నూతన దంపతులు కొరాపుట్ ఓఎంపీ కాలనీ నివాసం ఉండడంతో వారికి అవసరమైన సారె కింద ఇంటి సామగ్రి ఇచ్చారు. కానీ పెళ్లైన నాటి నుంచి అదనపు కట్నం కోసం ప్రియాంకపై భర్త భౌతిక దాడులు చేసేవాడు. ఇది తెలిసి కన్నవారు తమ శక్తి మేరకు అదనపు కట్నం పంపుతుండేవారు. భర్త వేధింపులతో ప్రియాంక పుట్టింటికి వెళ్లి సెప్టెంబర్ 4న తిరిగి కొరాపుట్ వచ్చింది. కానీ వేధింపులు ఆగలేదు. పుట్టింట తండ్రి ఆరోగ్య రీత్యా గత కొద్ది రోజులుగా వేధింపులు కన్నవారికి చెప్పలేదు. బుధవారం రాత్రి 8 గంటలకు వీడియో కాల్ ద్వారా ప్రియాంక తల్లిదండ్రులతో మాట్లాడింది. 9 గంటలకు శివ శంకర్ తన ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగింది వెంటనే రమ్మని టెక్కలికి ఫోన్ చేశాడు. వెంటనే వీరందరూ కొరాపుట్ చేరుకొని అనుమానంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించగా మృతురాలి తలపై ఇనుప రాడ్డుతో మోది చంపినట్లు తెలిసింది. దీంతో వెంటనే శివ శంకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ప్రియాంక చనిపోయాక శివశంకర్ తన తల్లిని, ఏడు నెలల కుమార్తెను ఇంటి బయట కూర్చోబెట్టాడు. అనంతరం మృతదేహాన్ని దహనం చేసి ఇంటికి నిప్పంటించాడు. మొదటి అంతా ఇది అగ్ని ప్రమాదమే అనుకున్నారు. కానీ మృతురాలి తల్లిదండ్రులు రావడంతో అసలు విషయం బయటపడింది. పోలీసుల విచారణలో శివ శంకర్ తన నేరం అంగీకరించారు.

జిల్లా కేంద్ర ఆస్పత్రికి
బ్యాటరీ అంబులెన్స్ వితరణ



బ్యాటరీ వాహనాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్, ఆస్పత్రి సిబ్బంది

కొరాపుట్:

జయపూర్ జిల్లా కేంద్ర ఆస్పత్రికి బ్యాటరీ అంబులెన్స్ వితరణ శుక్రవారం జరిగింది. ప్రముఖ వ్యాపారస్తులైన దివంగత జయ్‌కుమార్ జైన్, విజయ్ కుమార్ జైన్‌ల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఈ వాహనాన్ని సమకూర్చారు. ఆస్పత్రి ప్రధాన ద్వారం నుంచి వైద్య భవనాలు చాలా దూరంగా ఉన్నాయి. దీంతో వృద్ధ రోగులు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. వారి సౌకర్యార్థం బ్యాటరీతో చేసిన ప్రత్యేక వాహనం జైన్ కుటుంబీకులు అందజేయగా.. జయపూర్ సబ్ కలెక్టర్ ఆకవరం సస్యరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జైన్ కుటుంబానికి చెందిన సంజయ్ కుమార్ జైన్ పాల్గొన్నారు.



బ్యాటరీ వాహనం

మహిళా కాంగ్రెస్ సలహాదారుగా రత్నమణి ఉల్కా



తల్లి రత్నమణి ఉల్కతో ఎంపీ సప్తగిరి ఉల్క

కొరాపుట్: రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ముఖ్య సలహాదారుగా రత్నమణి ఉల్క నియమితులయ్యారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కొరాపుట్ పార్లమెంటరీ పరిధిలో మహిళా కాంగ్రెస్ నియామకాలు ప్రకటించింది. రత్నమణి ఉల్క కుమారుడు సప్తగిరి శంకర్ ఉల్క ప్రస్తుతం కొరాపుట్ ఎంపీగా కొనసాగుతున్నారు. దివంగత మంత్రి రామచంద్ర ఉల్క సతీమణి రత్నమణి ఉల్క. రామ చంద్ర ఉల్క సమయం నుంచే రత్నమణి ఉల్క కాంగ్రెస్ పార్టీలో మహిళా నాయకురాలిగా సేవలు అందజేశారు. గతంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా పనిచేశారు. అలాగే పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా కొనసాగారు. కుమారుడు ఎంపీ కాగా.. చాలాకాలం తర్వాత మరలా ఆమె క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చారు. దీంతో పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సెంచూరియన్ విశ్వవిద్యాలయానికి
అరుదైన గుర్తింపు



సెంచూరియన్ విశ్వవిద్యాలయం భవన సముదాయం

- డబ్ల్యూయూఆర్ ర్యాంక్ ప్రదానం

భువనేశ్వర్: సెంచూరియన్ విశ్వవిద్యాలయం ప్రపంచ గుర్తింపు సాధించింది. ఈ ఏడాది టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ (టీహెచ్‌ఈ) ప్రచురించిన ప్రతిష్టాత్మక వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ (డబ్ల్యూ యూఆర్)-2026లో జాతీయ, అంతర్జాతీయ ర్యాంకింగులు సొంతం చేసుకుంది. ప్రపంచ స్థాయిలో 1501+ గ్లోబల్ ర్యాంక్, జాతీయ స్థాయిలో 98వ ర్యాంక్‌ను సాధించి రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో అద్భుతమైన మైలురాయిని ఆవిష్కరించింది. ఇదివరకు వరుసగా 2 సార్లు టీహెచ్‌ఈ రిపోర్టర్ లిస్ట్, ఎస్‌డీజీ ర్యాంకింగ్స్‌లో చోటు దక్కించుకుంది.

ఈ ప్రపంచ గుర్తింపు బోధన, పరిశోధన, ఆవిష్కరణ, సామూహిక సాధికారత దిశలో విశ్వవిద్యాలయం పుంజుకుంటున్న నైపుణ్యతకు అద్దం పడుతుంది. నైపుణ్యం-సమగ్ర, సమగ్ర విద్యాభ్యాసంతో నైపుణ్యతకు సాన పెడుతూ భారత దేశంలోని అత్యంత ప్రగతిశీల విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా సెంచూరియన్ తన ఉనికిని చాటుకుంటోంది. జాతీయ స్థాయిలో సెంచూరియన్ విశ్వవిద్యాలయం 100 మేటి విశ్వవిద్యాలయాలలో ఒకటిగా కొనసాగుతోంది. ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, రాష్ట్ర విశ్వవిద్యాలయాల సరసన తళుక్కుమంటోంది. ప్రత్యేకమైన 'నైపుణ్య-సమగ్ర ఉన్నత విద్య' నమూనా, గ్రామీణ మరియు సామాజిక వ్యవస్థాపకత పట్ల ప్రాధాన్యతతో బోధన శైలితో భారత దేశ ఉన్నత విద్యా సంస్థల జాబితాలో దానిని ప్రత్యేక స్థానం సొంతం చేసుకోవడం విశేషం. సెంచూరియన్ యూనివర్సిటీ యొక్క గ్లోబల్ ర్యాంక్ బోధనా నాణ్యత, లోతైన పరిశోధన, జ్ఞాన సముపార్జన రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ ప్రామాణికలతో సుస్థిర పురోగతితో దినదినాభివృద్ధి చెందుతోంది.

ప్రపంచ స్థాయిలో సెంచూరియన్ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ విద్య, పరిశోధన ఆధారిత ప్రామాణికలతో ఆవిష్కరణ, సామాజిక పరివర్తన సమన్వయాన్ని దృఢపరుస్తుంది. ఐక్య రాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డీజీ), గ్రామ్ తరంగ్ ఎంప్లాయిబిలిటీ ట్రైనింగ్ సర్వీసెస్, ఇండస్ట్రీ స్పాన్సర్డ్ లాబొరేటరీస్, స్టార్టప్ ఎకోసిస్టమ్‌ల వంటి చొరవలతో సెంచూరియన్ విశ్వవిద్యాలయం సమయోచిత కార్యాచరణ పలు జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు సాధించి విద్యావేత్తలు, నైపుణ్యతలు, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించి వెనుకబడిన ప్రాంతాల నుంచి యువతకు సాధికారత కల్పించడంలో ముందడుగు వేస్తుంది. ఉపాధి, వ్యవస్థాపకత, సామాజిక ప్రభావానికి ప్రేరణాత్మక విద్యతో సెంచూరియన్ విశ్వవిద్యాలయం అనేక సంక్లిష్ట లక్ష్యాల్ని ఛేదించి తరచూ సరికొత్త విజయాల్ని సాధిస్తుంది. తాజాగా రిపోర్టర్ జాబితాలో స్థానం సాధించి ప్రపంచ వ్యాప్తంగా ర్యాంకింగు విశ్వవిద్యాలయంగా నిలిచింది. పరిశోధన నైపుణ్యాల మేళవింపుతో విద్యావేత్తలను తీర్చిదిద్దుతుందని వైస్ చాన్సలర్ ప్రొఫెసరు సుప్రియా పట్నాయక్ తెలిపారు.

వృద్ధులను గౌరవించాలి



వేదికపై అదనపు కలెక్టర్ నాయక్, డాక్టర్ మహంతి, మహేష్, శుభ్ర తదితరులు



వృద్ధులకు పెన్షన్ అందిస్తున్న డాక్టర్ మహంతి



కార్యక్రమంలో పాల్గొన్న వృద్ధులు

రాయగడ: జీవితంలో ఎన్నో అనుభవాలు చూసిన వృద్ధులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని అదనపు కలెక్టర్ రమేష్ చంద్ర నాయక్ అభిప్రాయపడ్డారు. జిల్లా సామాజిక సురక్షా సమితి ఆధ్వర్యంలో స్థానిక అశోక్ కల్యాణ మండపంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు మన బంగారు భవిష్యత్‌ను మలిచే ఆదర్శమూర్తులు అన్నారు. విద్యావేత్త డాక్టర్ డీకే మహంతి మాట్లాడుతూ ప్రతీ ఏడాది అక్టోబర్ ఒకటో తేదీన అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం జరుపుకుంటున్నప్పటికీ, ఈ ఏడాది వర్షాలు, దసర ఉత్సవాల వలన ఆలస్యంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. దేశ జనాభాలో సుమారు 11 శాతం మంది వృద్ధులు ఉండగా.. వారిలో అత్యధిక శాతం మంది వృద్ధాశ్రమాలకే పరిమితం కావడం విచారకరమన్నారు. మున్సిపల్ చైర్మన్ మహేష్ కుమార్ పట్నాయక్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ తరుపున ఇప్పటివరకు 520 మంది వృద్ధులకు రూ.1000 చొప్పున పెన్షన్ అందిస్తుండగా, వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మరో 120 మందికి కొత్తగా పెన్షన్ మంజూరు చేయడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శుభ్రపండ, జిల్లా సామాజిక సురక్షా సమితి అధికారి శ్రీకాంత్ పాణిగ్రాహి, రాయగడ బీడీవో సుదీప్ కుమార్ మిశ్రొ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు రోజూ వ్యాయామం చేయాలి

- జిల్లా ఎస్పీ జ్యోతింద్ర పండా
- పర్లాకిమిడిలో వయోవృద్ధుల దినోత్సవం



ఆకాంక్ష సంఘటన్ అధ్యక్షురాలు ఆశాలతా అమ్మన్నను సత్కరిస్తున్న అదనపు జడ్జి మరియు

పర్లాకిమిడి: వయోవృద్ధులు పిల్లలపై ఆధారపడకుండా రోజూ వ్యాయామం చేస్తుండాలని జిల్లా ఎస్పీ జ్యోతింద్ర పండా అన్నారు. స్థానిక బిజూ కళ్యాణ మండపంలో వయోవృద్ధుల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. జిల్లా సామాజిక సురక్షా శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదనపు జిల్లా మేజిస్ట్రేట్ ఫాల్గునీ మఝి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం ఏడు గంటలకు వృద్ధులకు యోగా శిక్షణ ఇచ్చారు. అనంతరం బీపీ, మధుమేహం పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందజేశారు. గౌరవ అతిథులుగా జిల్లా ఎస్పీ జ్యోతింద్ర పండా, డాక్టర్ అనంతసామంత రాయ్, సబ్ కలెక్టర్ అనుప్ పండా, ఉపాంత ప్రహారి, విశ్రాంత తహసీల్దార్ పూర్ణ చంద్ర మహాపాత్రో, విశ్రాంత ఉపాధ్యాయులు బినోద్ జెన్నా, హరిమోహన్ పట్నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడీఎం మఝి మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్లకు మెడికల్‌లో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశామని, 25 మంది వయోవృద్ధులకు సీతాపురంలో ఆశ్రయం కల్పించామన్నారు. జిల్లాలో వయోవృద్ధులకు ఆయుస్మాన్ భారత్ స్వస్థ్య కార్డులు ప్రభుత్వం ఇంతవరకూ అందజేయలేదన్నారు. వృద్ధులకు సమాజంలో రక్షణ, గౌరవం కొరవడిందని విశ్రాంత తహసీల్దార్ పూర్ణ చంద్ర మహాపాత్రో అన్నారు. సీనియర్ సిటిజన్లు నివేదితా రోథో, ఆశాలతా పాణిగ్రాహి, అశ్వినీ కుమార్ పాఢి, జగదీష్ చంద్ర మహాపాత్రో, గురండి గ్రామవాసి పినాకీ ప్రసాద్ జెన్నాలను దుశ్శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. 80 ఏళ్లు దాటిన వృద్ధులకు రూ.3,500 పింఛన్‌ను పర్లాకిమిడి పురపాలక సంఘం అందజేసింది. అలాగే వయో వృద్ధులు పూర్ణచంద్ర మహాపాత్రో, బినోద్ జెన్నాలను మెమెంటో, దుశ్శాలువతో జిల్లా ఎస్పీ జ్యోతింద్ర పండా సన్మానించి గౌరవించారు. కార్యక్రమం జిల్లా సామాజిక సురక్షా అధికారి లక్కోజు సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది.



వయోవృద్ధురాలు నివేదితా రోథోకు సత్కారం



వృద్ధులకు సుగర్ పరీక్షలు చేస్తున్న వైద్యులు



వృద్ధురాలికి పింఛన్ మంజూరు కార్డు, నగదు అందజేస్తున్న సబ్ కలెక్టర్



సీనియర్ సిటిజన్లకు యోగాభ్యాసం

విముక్తి రహస్యం పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో అతిథులు

రాయగడ: తమిళనాడులోని శ్రీమను జ్యోతి ఆశ్రమానికి చెందిన శ్రీమన్ నారాయణ, శ్రీలహరి క్రిష్ణ రచించిన శ్రీమద్భగత్ గీత విముక్తి రహస్యం పుస్తకావిష్కరణ కార్యక్రమం స్థానిక తేజస్వీ హోటల్ సమావేశం హాలులో శుక్రవారం జరిగింది. ప్రముఖ విద్యావేత్త డాక్టర్ డీకే మహంతి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు డాక్టర్ బాబూరావు మహంతి, నటుడు, కళాకారుడు ప్రభాకర్ మిశ్రో, స్థానిక ప్రసాద్ టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, తెలుగు పండితులు డాక్టర్ తులసి దాస్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీమన్ నారాయణ లహరి క్రిష్ణ చే రచించబడిన శ్రీమద్భగవత్ గీత విముక్తి రహస్యం పుస్తకాన్ని ఒడియా భాషలో ప్రముఖ కవి ప్రదీప్ కుమార్ నాయక్ అనువదించారని ఆశ్రమానికి చెందిన టి.మార్టిన్ పేర్కొన్నారు. అనంతరం పుస్తకం సారాంశాన్ని వివరించారు. సృష్టిలొ దేవుడు ఒక్కడేనన్న సందేశంతో రచించిన ఈ పుస్తకాన్ని అందరూ చదవాలని అన్నారు. ఆధ్యాత్మిక గ్రంథమైన భగవద్గీతలోని పలు అంశాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు డాక్టర్ డీకే మహంతి మాట్లాడుతూ.. భగవద్గీత సనాతన ధర్మానికి ప్రతీకగా నిలిచిందని అన్నారు. అటువంటి మహాగ్రంథంలో ప్రతీ అంశం మానవాళి మనుగడకు దిశానిర్దేశం చేస్తుందని వివరించారు. డాక్టర్ బాబూరావు మహంతి మాట్లాడుతూ.. ఇటువంటి తరహా ఆధ్యాత్మిక కార్యక్రమాలు తరచూ జరిగే విధంగా సంస్థలు కృషి చేయాలని అన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా మన హైందవ సంప్రదాయం, సంస్కృతులు, మన ఆచార వ్యవహారాలు భావితరాలు తెలుసుకునే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు.

క్లుప్తంగా

320 మంది దివ్యాంగుల గుర్తింపు



భీమభొయి దివ్యాంగుల శిబిరంలో సమితి అధ్యక్షుడు తరుణసేన్ బిశాయి తదితరులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కుంద్ర సమితిలో భీమభొయి వికలాంగ పథకంలో దివ్యాంగుల గుర్తింపు శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరంలో సమితి అధ్యక్షులు తరుణసేన్ బిశాయి ముఖ్యఅతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. గౌరవ అతిథులుగా జిల్లా పరిషత్ అధ్యక్షుడు రాదాబినోద్ సామంతరాయ్, బీడీఓ పి.మనశ్మిత, కొట్‌పాడ్ ఎమ్మెల్యే ప్రతినిధి బద్రి నారాయణ ఆచార్యతో పాటు సమితి సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు. శిబిరంలో 320 మందిని గుర్తించినట్లు తెలిపారు. వీరికి గుర్తింపు కార్డులు అందజేశారు. శిబిరంలో వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.ఎస్. మిశ్ర, డాక్టర్ దేవాశిశ్ మహాపాత్రో, శివానంద బుద్ధియ, కిశాన్ కుమార్ సాహు, లలటేందు మిశ్ర, సవ్య సాచి మహాపాత్రో పాల్గొన్నారు.

శ్రీకృష్ణచంద్ర గజపతి కళాశాల ప్రిన్సిపాల్‌గా రాధాకాంత భుయ్యాన్



బాధ్యతలు చేపట్టిన రాధాకాంత భుయ్యాన్

పర్లాకిమిడి: స్థానిక శ్రీకృష్ణచంద్ర గజపతి కళాశాల ప్రిన్సిపల్‌గా రాధాకాంత భుయ్యాన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. భుయ్యాన్ ఎస్‌కేసీజీ కళాశాలలో హిస్టరీ అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. రాధాకాంత భుయ్యాన్ స్వస్థలం గజపతి జిల్లాలో రాయఘడ బ్లాక్. భుయ్యాన్ బరంపురం విశ్వవిద్యాలయంలో చరిత్ర సబ్జెక్టులో పోస్టుగాడ్యుయేషన్ చేసి 1996-98లో గంజాం జిల్లా కోనిసి, ఛత్రపురం ప్రభుత్వ కళాశాలల్లో కొన్నాళ్లు పని చేసి పర్లాకిమిడి కళాశాలకు బదిలీ అయ్యి వచ్చారు.రాధాకాంత భుయ్యాన్ పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కళాశాల అధ్యాపకులు, పాత విద్యార్థుల సంఘం అధ్యక్షులు శంకర్ ప్రసాద్ భక్షి, శశిభూషన్ పాఢి, బసంత్ పండా తదితరులు అభినందనలు తెలియజేశారు.

స్కౌట్స్‌పై అవగాహన పెంచాలి



వేదికపై అతిథులు

మల్కన్‌గిరి: స్కౌట్స్‌పై అవగాహన పెంచాలని వక్తలు అన్నారు. మల్కన్‌గిరి మహిళా మాధ్యమిక మహావిద్యాలయంలో జిల్లా స్థాయి స్కౌట్ గైడ్‌పై ప్రాథమిక చర్చా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి చిత్తరంజన్ పాణిగ్రాహీ అధ్యక్షత జరిగిన కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా రాష్ట్ర శిక్షణ కమిషనర్ సురజిత్ సేన్, గౌరవ అతిథులుగా అదనపు జిల్లా విద్యాశాఖ అధికారి భగీరధీ బెహేరా, అదనపు విద్యాధికారిణి మంజులతా భోయి, కళాశాల అధ్యక్షుడు దుష్మంత్ కుమార్ జేనా, జిల్లా శారీరక విద్యాధికారి కార్తిక చంద్ర బెహర పాల్గొన్నారు. 250 మంది ఉపాధ్యాయులు హాజరవ్వగా.. వీరికి స్కౌట్ గైడ్‌పై అవగాహన కల్పించారు.

వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల : ఏపీఈఏపీ సెట్-2025 ప్రవేశ పరీక్షకు హాజరైన బైపీసీ విద్యార్థులకు సంబంధించి బీ-ఫార్మసీ, ఫార్మా-డీ, బయో/ఫుడ్ టెక్నాలజీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించేందుకు వెబ్ కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదలైందని జిల్లా ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్, సహాయక కేంద్రం జిల్లా సమన్వయకర్త కె.నారాయణరావు శుక్రవారం తెలిపారు. తొలి విడతగా ఈ నెల 12 నుంచి 18వరకు, తుది విడతగా ఈ నెల 25 నుంచి 29 వరకూ ధ్రువపత్రాల పరిశీలన జరుగుతాయని పేర్కొన్నారు. 21న సీట్ల కేటాయింపు ఉంటుందని, వివరాలకు పాలిటెక్నిక్ కళాశాలలోని సహాయ కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

పకడ్బందీగా ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలు పకడ్బందీగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కమిటీ సభ్యులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వివిధ స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్న అట్రాసిటీ కేసుల పరిష్కారానికి అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. పలు కేసుల్లో మూడు నెలల్లో బాధితులకు రూ.18 లక్షల వరకు పరిహారం చెల్లించామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కూన రవికుమార్, బగ్గు రమణమూర్తి, గొండు శంకర్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ఏఎస్పీ శ్రీనివాసరావు, ఆర్డీవో సాయి ప్రత్యూష, డీఎస్పీ సీహెచ్.వివేకానంద, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ గెడ్డమ్మ, బీసీ సంక్షేమాధికారి అనురాధ, కమిటీ సభ్యులు గేదెల రమణమూర్తి, దాసరి తిరుమలరావు మాదిగ, దండాసి రాంబాబు, తోట రాములు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మా బ్లాక్‌లో పంట నష్టం పరిశీలన

పర్లాకిమిడి: గుమ్మాబ్లాక్‌లో వరుస వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి శుక్రవారం పరామర్శించారు. అధికంగా తరవ పంచాయతీలో ఆశ్రియగడ వంతెన కొట్టుకుపోగా, సుకేయి గ్రామంలో వరి పంట కోత యంత్రం కొట్టుకుపోయింది. అలాగే మడ్వాల్ గ్రామంలో పలువురు రైతుల వరి పంట వర్షాలకు పోయింది. ఎమ్మెల్యే రూపేష పాణిగ్రాహి బాధితులను పరామర్శించి పంట నష్ట పరిహారం కోసం అధికారులతో మాట్లాడతానని అన్నారు. ఆయన వెంట గుమ్మా బ్లాక్ అధ్యక్షురాలు సునేమీ మండళ్, గుమ్మా బీడీఓ దులారాం మరాండి, జూనియర్ ఇంజినీర్లు, బిజేడీ జిల్లా అధ్యక్షులు ప్రదీప్ నాయక్ తదితరులు ఉన్నారు.



గుమ్మాలో ఆశ్రియగడలో వంతెన కొట్టుకుపోవడంతో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

సీబీఐ దర్యాప్తు కోసం పిల్

భువనేశ్వర్: ఒడిశా పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) నియామక పరీక్షలో జరిగిన కుంభకోణంపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)తో దర్యాప్తు కోసం ఆదేశాలు జారీ చేయాలనే అభ్యర్థనతో రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానంలో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. ఒడిశా పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఓపీఆర్‌బీ) నిర్వహించిన సబ్ ఇన్‌స్పెక్టర్ పరీక్షలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని న్యాయవాది శివశంకర్ మహంతి దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. క్రైం శాఖ ఈ కుంభకోణంపై దర్యాప్తు నిర్వహిస్తుంది. అయితే ఈ మోసం పూర్తి స్థాయిని క్రైం శాఖ వెలుగులోకి తీసుకు రాలేదు. ఇందులో కోట్లాది రూపాయల లావాదేవీలు, సీనియర్ అధికారులతో సహా అనేక మంది ప్రభావవంతమైన వ్యక్తులతో సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. క్రైం శాఖ పోలీసులు ఈ మోసం కేసులో 117 మంది అభ్యర్థులను, 3 మంది దళారులను అరెస్టు చేశారు. దర్యాప్తు ముందుకు సాగుతున్న కొద్దీ అనేక మందిని అరెస్టు చేశారు. ఈ కుంభకోణంలో మాజీ డీఐజీ కొడుకు ప్రమేయం ఉందని వార్తలు ప్రసారం అవుతున్నాయి. రాష్ట్రం బయట ప్రాంతాల్లో అక్రమార్కులు విస్తరించి ఉన్నట్లు తెలుస్తోంది. విస్తృత వ్యవస్థీకృత నెట్‌వర్క్‌లో భాగంగా ఈ కుంభకోణం జరుగుతున్నట్లు ఆరోపణ. వంద మందికి పైగా ఇందులో ప్రమేయం ఉన్నట్లు అనుమానిస్తున్నారని పిటిషన్‌లో వివరించారు. విద్యావంతులైన ప్రభుత్వ ఉద్యోగం ఆశావాదులు, నిరుద్యోగ యువత విశ్వాసాన్ని తాజా మోసం సంఘటన తీవ్రంగా ప్రభావితం చేసిందని పిటిషినరు పేర్కొన్నారు. పారదర్శకంగా, నిష్పాక్షికంగా దర్యాప్తు జరగాలని కోరుతూ, కేసును సీబీఐకి బదిలీ చేయాలని హై కోర్టు ఆదేశించాలని పిటిషనర్ కోరారు. ప్రస్తుత దర్యాప్తుపై స్థాయీ నివేదికని దాఖలు చేయాలని పిటిషన్‌లో న్యాయ స్థానాన్ని అభ్యర్థించారు. ఈ కేసులో హోం శాఖ కార్యదర్శి, రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్, క్రైమ్ శాఖ అదనపు డైరెక్టర్ జనరల్, ఓపీఆర్‌బీ చైర్మన్‌ను ప్రతివాదులుగా పేర్కొన్నారు.

డయాలసిస్ సేవలు సకాలంలో అందాలి

- జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ

శ్రీకాకుళం: జిల్లాలోని కవిటి, సోంపేట మండలాల్లో కిడ్నీ వ్యాధి బారిన పడిన వారికి డయాలసిస్ సేవలు సకాలంలో అందించాలని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో పలు స్థాయీ సంఘ సమావేశాలు ఆమె అధ్యక్షతన జరిగాయి. ఆమె మాట్లాడుతూ జిల్లా పరిషత్ సాధారణ సభ్య సమావేశాలు, స్థాయీ సంఘ సమావేశాలకు జిల్లా అధికారులు రాకుండా వారి ప్రతినిధులను పంపుతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరైనా అధికారులు రాని పరిస్థితుల్లో ముందస్తు అనుమతులు పొందాలని సూచించారు. 4వ స్థాయీ సంఘ సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖపై సమీక్షలో డయాలసిస్ బెడ్‌లు పెంచాలని అధికారులను కోరారు. 2వ స్థాయీ సంఘ సమావేశంలో జిల్లాలో చాలా మంది అర్హుల పింఛనుల జాబితాలు ఎంపీడీఓల లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్నాయని సభ్యులు తెలపడంతో వాటిని క్లియర్ చేయడంతో పాటు ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. 2వ స్థాయీ సంఘ సమావేశంలో డీడబ్ల్యూఎంఏ చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. 7వ స్థాయీ సంఘ సమావేశంలో పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ పనులు నిర్దేశించిన కాలంలో చేయకుండా కాలం చెల్లిన, మొదలు పెట్టని పనుల వివరాలు ఇవ్వాలని తెలిపారు. ఉద్దానం ప్రాజెక్టు పైప్‌లైనులు ఎక్కువగా లీక్‌లు అవుతున్నాయని, సత్వరమే మరమ్మతులు చేపట్టి నీటి వృధాను అరికట్టాలన్నారు.



జిల్లా స్థాయీ సంఘ సమావేశంలో నివేదికలు పరిశీలిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ

ఉదయం 3, 5, 6 వ స్థాయీ సంఘ సమావేశాల్లో ప్రగతి నివేదికలను అధికారులు తెలియజేశారు. కార్యక్రమంలో ఆమదాలవలస ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్, సీఈఓ డి.సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యులు ధర్మాన కృష్ణ చైతన్య, జంపు కన్నతల్లి, సురవరపు నాగేశ్వరావు, కె.త్రినాథ్, టొంపల సీతారాముడు, కాయల రమణ, కామాక భాగ్యవతి, మీసాల సీతం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దూడల అక్రమ రవాణా అడ్డగింత

నరసన్నపేట: జాతీయ రహదారిపై అక్రమంగా లగేజీ వాహనంలో తరలిస్తున్న 16 దూడలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు మడపాం టోల్‌గేట్ వద్ద శుక్రవారం సాయంత్రం పట్టుకున్నా రు. తిలారు నుంచి అలమండకు అక్రమంగా ఈ దూడలను తీసుకువెళ్తున్నట్లు గురించారు. వీటిని నరసన్నపేట పోలీసులకు అప్పగించగా ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి గోశాలకు పంపించారు.



పోలీసులు సీజ్ చేసిన వాహనం

ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రతిభ

ఎచ్చెర్ల : శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయం (ఐఐఐటీ) విద్యార్థులు అఖిల భారత విశ్వవిద్యాలయాల యోగా చాంపియన్‌షిప్-2025కు ఎంపికయ్యారు. ఈ నెల 8, 9వ తేదీల్లో నూజివీడులో జరిగిన అంతర్ కళాశాల యోగా పోటీల్లో రాష్ట్ర స్థాయిలో బి.భావన, కె.మేఘన వ్యక్తిగత విభాగంలో అర్హత సాధించారు. బృంద విభాగంలో ఎం.హేమరితిక, పి.కారుణ్య, ఎస్.నళిని, ఏ.రాధిక, జి.మహేశ్వరి, ఇ.భరత్‌సాయి, పి.జవితనాయుడు, ఎం.నవీన్‌కుమార్, కె.రాకేష్ అర్హత సాధించారు. వీరంతా నవంబర్ 24 నుంచి 28 వరకూ బెంగళూరులో జరగనున్న జాతీయ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. వీరిని వర్సిటీ సంచాలకులు ప్రొఫెసర్ కేవీజీడీ బాలాజీ, పరిపాలనాధికారి డాక్టర్ మునిరామకృష్ణ, డీన్ డాక్టర్ శివరామకృష్ణ, ఫైనాన్స్ అధికారి డాక్టర్ వాసు, వెల్ఫేర్ డీన్ డాక్టర్ గేదెల రవి, యోగా విభాగాధిపతి డాక్టర్ ఈశ్వరరావు, యోగా అధ్యాపకులు అర్చన, జి.ధనుంజయరావు, పీఆర్‌వో మామిడి షణ్ముఖరావు శుక్రవారం అభినందించారు.



విద్యార్థులతో ట్రిపుల్ ఐటీ అధికారులు

చైన్‌స్నాచింగ్ ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లక్ష్మణరావు

- నిందితులంతా ట్రాన్స్‌జెండర్లే
- 38 గ్రాముల బంగారు గొలుసులుస్వాధీనం

నరసన్నపేట: ఉత్తరాంధ్రతో పాటు పలుచోట్ల ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న పురుషులే లక్ష్యంగా చేసుకొని చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ట్రాన్స్‌జెండర్స్ ముఠాను నరసన్నపేట పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ మేరకు టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు శుక్రవారం నరసన్నపేటలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఇటీవల నరసన్నపేట మండలం ఉర్లాం సమీపంలో నడగాంకు చెందిన దొంపాక ఆనందరమణను కొందరు ట్రాన్స్‌జెండర్ల అడ్డగించి చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేయగా ముఠా పట్టుబడింది. ఉర్లాంతో పాటు ఇచ్ఛాపురం, జి.సిగడాం మండలం ఉల్లివలస జంక్షన్, పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబల్లి మండలం సంకిలిలో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడినట్లు నిందితులు అంగీకరించారు. బైక్‌లపై వచ్చిన వారి మెడలో నుంచి బంగారు చైన్లు లాక్కొని సమీపంలో ఉన్న కారులో వీరు పారిపోతుంటారు. ఈ కేసులో తెర్లాం మండలం పిరిడి గ్రామానికి చెందిన నందిగామ నేహా, కాకినాడ జిల్లా రేచర్లపేటకు చెందిన మండల శ్రావణి, పార్వతీపురం జిల్లా వీరఘట్టంకు చెందిన అలుబిల్లి ప్రియ, రంపచోడవరం ప్రాంతానికి చెందిన బేదంపూడి సాయిపల్లవి, పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన నాగిరెడ్డి సుష్మలతో పాటు వీరికి సహాయకారిగా ఉన్న కారు డ్రైవర్ తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం వేమగిరికి చెందిన సేలం రాంప్రవీణ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వీరందరినీ మడపాం టోల్‌గేట్ వద్ద శుక్రవారం పట్టుకొని విచారించగా చోరీలకు పాల్పడుతున్నట్లు అంగీకరించారు. వీరి వద్ద నుంచి 38 గ్రాముల బరువున్న మూడు బంగారు చైన్లు రికవరీ చేశారు. నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు, నరసన్నపేట, పోలాకి ఎస్ఐలు సీహెచ్ దుర్గాప్రసాద్, రంజిత్‌లు కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్నందుకు డీఎస్పీ అభినందించారు.

టెక్కలిలో సైబర్ మోసం

టెక్కలి రూరల్: టెక్కలికి చెందిన టి.వాసంతి అనే మహిళ వాట్సాప్ నంబర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు హ్యాక్ చేసి తన స్నేహితుల నుంచి డబ్బులు కాజేశారు. ఈ మేరకు బాధితురాలు శుక్రవారం టెక్కలి పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. తన ఫోన్‌పే పని చేయడం లేదని, అత్యవసరంగా రూ.35వేలు కావాలని, తాను పెట్టిన క్యూఆర్ కోడ్‌కు డబ్బులు పంపాలని వాసంతి వాట్సాప్ నంబర్ ద్వారా బెంగళూర్‌కు చెందిన ఆమె సన్నిహితులుకు మెసేజ్ వెళ్లడంతో వారు రూ.35వేలు పంపించారు. విషయం తెలుసుకున్న వాసంతి తన నంబర్ హ్యాక్ అయిందని గుర్తించి టెక్కలి పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ రాము కేసు నమోదు చేశారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

శ్రీకాకుళం క్రైమ్ : గుజరాతీపేటలో ఓ వ్యక్తి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు శుక్రవారం పేర్కొన్నారు. సీమేన్‌గా పనిచేస్తున్న బర్రి నాగరాజుకు 13 ఏళ్ల కొందట వివాహమైంది. ఇద్దరు పిల్లలున్నారు. తనను తరచూ వేధిస్తున్నాడంటూ భార్య ఇటీవలే పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో మనస్థాపానికి గురైన నాగరాజు శుక్రవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

టెక్కలి రూరల్: టెక్కలి డిగ్రీ కాలేజీ వెనుకనున్న మామిడి తోటలో శుక్రవార రాత్రి ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. మృతదేహం కింద మంట ఉండటం, పైన ఉరి వేసుకొని వేలాడుతుండటంతో హత్యా?ఆత్మహత్యా తెలియడం లేదు. పోలీసులు వచ్చి పరిశీలించగా.. మృతుడు స్థానిక ఎన్టీఆర్ కాలనీ 9వ లైన్‌లో నివాసముంటున్న ప్రధాన గణపతి(50)గా గుర్తించారు. మృతుడి భార్య సుమిత్రో ప్రధాన్ ఫిర్యాదు మేరకు టెక్కలి ఎస్సై రామ్ అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతుడు రెండు రోజులుగా కనిపించడం లేదని, ఎక్కడికో వెళ్లి ఉంటాడని భావిస్తున్న తరుణంలో ఈ ఘటన చోటు చేసుకుందని మృతుడి భార్య తెలిపింది.

లైసెన్స్ లేని బాణసంచా జప్తు

నందిగాం: మండలకేంద్రమైన నందిగాంలో ప్రగడ బాబూరావు అనే వ్యక్తి లైసెన్స్ లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన రూ.లక్షా ఎనిమిది వేల విలువైన బాణసంచాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై షేక్ మహమ్మద్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు వృద్ధుడు మృతి

హిరమండలం: పింధ్రువాడ కాలనీకు చెందిన దువ్వు శిమ్మయ్య (70) శుక్రవారం సాయంత్రం పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దువ్వు శిమ్మయ్య, కుమారుడు హరికృష్ణ కలిసి ఎప్పటిలాగే మంగళవారం కూడా గొర్రెలు మేపేందుకు వెళ్లారు. సాయంత్రం పొలంలో గొర్రెలు కాస్తుండగా ఒక్కసారిగా శిమ్మయ్యపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో కుమారుడికి ఎటువంటి గాయాలు కాలేదని గ్రామస్తులు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన వారితో ఆ పార్టీ నాయకులు

రాయగడ: జిల్లాలోని రామనగుడ సమితి పరిధిలో గల గొగుపాడు, అదామ్‌గుడ, అచవ, పొల్లిదంగి, గొరుండ ప్రాంతాలకు చెందిన 40 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. గుణుపూర్‌లో గల బంగ్లాలో ఈ మేరకు గురువారం నాడు జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు (కాంగ్రెస్) బంచానిధి బెహర సమక్షంలో వారంతా కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగొ ప్రజల గురించి చేస్తున్న సేవా కార్యక్రమాలు తమకు ఆకట్టుకున్నాయని అందువల్ల ఆ పార్టీలో చేరామని పార్టీలో చేరిన వారు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భిశ్వనాత్ బలియార్ సింగ్, నిలు సాహు, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.


మా మజ్జిగౌరి ప్లంబర్స్ సంఘం కార్యవర్గం ఎన్నిక



సంఘ కొత్త కార్యవర్గం

రాయగడ: మా మజ్జిగౌరి ప్లంబర్స్ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటయ్యింది. స్థానిక పీహెచ్‌సీ ఖిన్ఖినా కొండపై గల ఆంజనేయ స్వామి ఆలయం ప్రాంగణంలో శుక్రవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షులుగా దామోదర్ చౌదరి, ఉపాధ్యక్షులుగా రామచంద్ర నాయక్, సాధారణ కార్యదర్శిగా జయచంద్ర ఖొర, కార్యదర్శిగా సుమంత్ పరిడ, సహాయ కార్యదర్శిగా శ్రీకాంత్ సామల్, కోశాధికారిగా బలరాం నాయక్, సహ కోశాధికారిగా ప్రతాప్ దాస్‌లు నియమితులయ్యారు. మూడేళ్ల క్రితం సంఘం ఏర్పాటైంది. త్వరలో భవిష్యత్ ప్రణాళికలు రూపొందించడంతో పాటు సభ్యుల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించే విధంగా కృషి చేసేందుకు ప్రయత్నిస్తానని అధ్యక్షులుగా నియమితులైన చౌదరి తెలిపారు.

పిడుగు పాటా.. బ్లాస్టింగా..!





- బ్లాస్టింగ్ కోసం అమర్చిన పేలుడు పదార్థాలు పిడుగు దెబ్బకు పేలినట్టు అనుమానాలు
- కీలక నేత సోదరుడి జోక్యంతో వాస్తవాలు బయటకు రావడం లేదన్న వాదనలు
- దబ్బగూడ క్వారీ బాధ్యులపై ఎంత మేరకు చర్యలు తీసుకున్నారో తెలియని పరిస్థితి
- యాజమాన్యాలకు అనుకూలంగా మంతనాలు

- గంగరాజపురం గ్రానైట్ క్వారీ సంఘటనపై భిన్నాభిప్రాయాలు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

క్వారీల్లో ప్రమాదాలపై అనుమానాలు ఆగడం లేదు. మొదట పిడుగు పడింది అని చెప్పడం ఆపై తీరిగ్గా బ్లాస్టింగ్ వల్ల చనిపోయారని తేల్చడం పరిపాటిగా మారిపోయింది. ఆ మధ్య దబ్బగూడలోని మానీస్ కూనపురెడ్డి క్వారీలో ప్రమాదకరంగా ముగ్గురు దుర్మరణం చెందారు. మృతదేహాలను కిందకు తెచ్చేసి పిడుగు పాటే కారణమని చిత్రీకరించారు. కుటుంబ సభ్యులు ప్రతిఘటించి, నిరసనకు దిగడంతో అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి పిడుగు పాటు కాదని బ్లాస్టింగ్ అని తేల్చారు. తాజాగా గంగరాజపురంలో రాజ్‌యోగి గ్రానైట్ క్వారీలో కూడా ప్రమాదకరంగా ముగ్గురు మృతి చెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన కూడా పిడుగు పాటు వల్లే అని చెబుతున్నారు. కానీ వాస్తవ పరిస్థితి వేరనే వాదనలు ఉన్నాయి. ఇక్కడ కూడా బ్లాస్టింగ్ కోసం సిద్ధం చేసి ఉండగా, పిడుగు పాటుకు గురై అవి పేలడంతో మరణాలు సంభవించినట్లు అనుమానాలు ఉన్నాయి.

అన్నీ తానై...

జిల్లా గ్రానైట్ క్వారీలకు కీలక నేత సోదరుడు నాయకత్వం వహిస్తున్నారు. అంతా తానై వ్యవహరిస్తున్నారు. ఆయన కనుసన్నల్లోనే క్వారీలు నడుస్తున్నాయి. అధికార వర్గాలు సైతం జీ హుజూర్ అంటున్నాయి. ఏ క్వారీకి అనుమతులు ఇవ్వాలి? ఏ క్వారీకి అడ్డంకులు సృష్టించాలి? ఏ క్వారీకి పర్మిట్‌లు ఇవ్వాలి? ఏ క్వారీకి పర్మిట్‌లు ఇవ్వకూడదు? ఏ బ్లాక్‌లను ఏ ట్రాలీ రవాణా చేయాలి? ఏ ట్రాలీ రవాణా చేస్తే అడ్డుకోవాలి? తదితర నిర్ణయాలన్నీ ఆ కీలక నేత సోదరుడే అమలు చేస్తున్నారు. తన అనుచరులు కాని వారికి ఉన్న క్వారీలన్నీ చాలా వరకు నడవని పరిస్థితి ఉంది. ఇదే సమయంలో తన గుప్పెట్లో ఉన్న గ్రానైట్ క్వారీలకు కష్టం వచ్చినా, నష్టం వచ్చినా బాధితులకు అన్యాయం జరిగినా యాజమాన్యాలకు అనుకూలంగా ఉంటున్నారు. ఆ క్రమంలో ఎక్కడైనా క్వారీల్లో ప్రమాదాలు జరిగితే మేనేజ్ చేయిస్తున్నారు.

ఈ నేపథ్యంలో గతంలో మెళియాపుట్టి మండలం దబ్బగూడ సమీపంలో మానీష్ కూనపురెడ్డి గ్రానైట్ క్వారీలో జరిగిన సంఘటనలో మొదటగా పిడుగుపాటు అని యాజమాన్యం మభ్యపెట్టే ప్రయత్నం చేసినప్పటికీ మృతదేహాలపై వస్త్రాలు చిరిగిపోవడం, అవయవాలు చెల్లా చెదురుగా పడిపోవడంతో పాటు వారంతా స్థానిక కార్మికులు కావడంతో ఆయా కుటుంబాలు అనుమానం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగడంతో అసలు నిజాలు వెలుగులోకి వచ్చాయి. చివరగా బ్లాస్టింగ్ వల్లనే కార్మికులు మృత్యువాత పడినట్లు తేలింది. అయితే ఈ సంఘటనకు సంబంధించి కేసులో బాధ్యులపై ఎంత మేరకు చర్యలు తీసుకున్నారనే విషయమై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

అసలు ఏం జరిగింది..?

ఇప్పుడు తాజాగా గంగరాజపురం సమీపంలో రాజ్‌యోగి గ్రానైట్ క్వారీలో జరిగిన సంఘటనలో మృత్యువాత పడిన వారంతా రాజస్థాన్, బీహార్, మధ్యప్రదేశ్‌కు చెందిన కార్మికులు కావడంతో స్థానికంగా సంఘటనపై గట్టిగా నిలదీసే పరిస్థితులు కనిపించలేదు.

- సంఘటన జరిగిన రోజు సాయంత్రం బ్లాస్టింగ్ కోసం పేలుడు పదార్థాలు అమర్చి కొంత దూరంలో తలదాచుకున్న క్రమంలో ఒక్క సారిగా పిడుగులు రావడం, ఆ ప్రభావంతో ఒక్క సారిగా విద్యుత్ ప్రసరణ జరిగి ఇదే క్రమంలో కార్మికుల సమీపంలో దాచిపెట్టిన పేలుడు పదార్థాలు బ్లాస్టింగ్ కావడంతో సంఘటన జరిగినట్లు భిన్నమైన కథనాలు తెరపైకి వస్తున్నాయి.
- పిడుగుపాటుకు గురైన వ్యక్తులకు వస్త్రాలు చిరిగిపోయి బలమైన గాయాలు కావడం వంటి సంఘటనలు జరుగుతాయా అనే సందేహాలు చోటు చేసుకుంటున్నాయి.
- మరో వైపు విద్యుత్ షాక్ వలనే కార్మికులు మృత్యువాత పడ్డారంటూ పలు ప్రజా సంఘాలు టెక్క లి ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగాయి.
- ఈ సంఘటనలో మృతి చెందిన వారికి స్థానికంగా సరైన బలం లేకపోవడంతో కీలక నేత సోదరుడు మరో సారి వ్యవహారం చక్కదిద్దేందుకు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది.
- ఎక్కడా అనుమానం రాకుండా బాధితులను, అధికారులను మేనేజ్ చేయడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం.
- క్వారీలో జరిగిన సంఘటన పిడుగుపాటుతో జరిగిందా, లేక బ్లాస్టింగ్ వలన జరిగిందా, ప్రజా సంఘాలు ఆరోపించినట్లుగా విద్యుత్ షాక్ వలన జరిగిందా అనేది తేల్చాల్సి ఉంది. ఏది ఏమైనప్పటికీ కీలక నేత సోదరుడి కనుసన్నల్లోనే వ్యవహారం చక్కదిద్దే మంతనాలు జరుగుతున్నాయని సమాచారం.

పారదర్శకంగా పన్ను చెల్లింపు

ఎచ్చెర్ల: విద్యార్థులు దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించగలరని, ఆర్థిక అవగాహనతో జీఎస్టీ పన్ను చెల్లింపుల్లో పారదర్శకత పాటించి దేశాభివృద్ధికి తోడ్పడాలని విశాఖపట్నం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ విభాగం, సీనియర్ ఇంటెలిజెన్స్ అధికారి డాక్టర్ కేవీ మోహనరావు అన్నారు. మండలంలోని కుశాలపురంలోని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన సూపర్ జీఎస్టీ 2.0-సూపర్ సేవింగ్స్ సెలబ్రేషన్స్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ వ్యవస్థ, దీని ప్రాముఖ్యత, పన్ను చెల్లింపులో పారదర్శకతను వివరించారు.

క్లుప్తంగా

మానసిక ఆరోగ్యం ముఖ్యం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణ ప్రసాద్

విజయనగరంఫోర్ట్: ప్రతి ఒక్కరికీ శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం ముఖ్యమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ మానసిక వైకల్యం కలిగిన వ్యక్తులకు ఉచిత న్యాయసహాయం అందించనున్నట్లు తెలిపారు. మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి వ్యక్తికి గౌరవంగా జీవించే హక్కు ఉందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దేవీ మాధవి, సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ, మానసిక విభాగం అధిపతి డాక్టర్ శారద తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు ముద్దాయిలకు జైలుశిక్ష

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో జరిగిన దొంగతనం కేసులో ముగ్గురు ముద్దాయిలకు ఆరు నెలల జైలు శిక్ష పడిందని గరివిడి ఎస్సై బి.లోకేశ్వరరావు తెలిపారు. గరివిడి పోలీస్‌స్టేషన్ పరిధి కొండపాలెంలో గల బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో జులై 19వ తేదీ 2021వ సంవత్సరంలో దొంగతనం జరిగిందని, ఇందుకు సంబంధించి అప్పట్లో ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం చార్జ్‌షీటు కోర్టులో ఫైల్ చేశారని తెలిపారు. ఈ మేరకు తనతో పాటు కోర్టు పోలీస్ కానిస్టేబుల్ సకాలంలో సాక్షులను కోర్టులో హాజరుపరిచామన్నారు. ఈ కేసులో వాదనల అనంతరం చీపురుపల్లి జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ పి.బుజ్జి ముద్దాయిలైన మంచాల పైడిరాజు, పెద్దకాపు శ్రీను, గడపర్తి ఆదినారాయణలకు జైలు శిక్ష విధించారని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన ఎరుక రాజు

గజపతినగరం: మండలంలోని పాతశ్రీరంగరాజపురం గ్రామానికి చెందిన దుక్కా ఎరుకరాజు(52) ఈ నెల 3వ తేదీన ఇంటినుంచి బయటకు వెళ్లి నేటికీ ఇంటికి చేరలేదు. ఈ మేరకు ఆయన భార్య దుక్కా రాములమ్మ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు శుక్రవారం రాత్రి ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు చెప్పారు.

బావిలో యువకుడి మృతదేహం



ఎలకల రాము(ఫైల్)

చీపురుపల్లి: మండలంలోని పుర్రేయవలస సమీపంలోని ఓ బావిలో యువకుడి మృతదేహం లభించింది. ఆ యువకుడు ప్రమాదవశాత్తు బావిలో పడి మరణించాడా లేక ఏదైనా మిస్టరీ ఉందా అనే విషయాలు తెలియాల్సి ఉంది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పత్తికాయవలస పంచాయతీ మధుర గ్రామమైన ముగిదిపేట గ్రామానికి చెందిన ఎలకల రాము (26) పుర్రేయవలస సమీపంలో ఇటుకల తయారీ కేంద్రంలో పొక్లెయిన్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం సాయంత్రం ఇటుక తయారీ కేంద్రంలో విధులు ముగించుకుని ఇంటికి బయిల్దేరాడు. అదే రోజు రాత్రి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. దీంతో రాము యజమాని వద్దకు వచ్చి వాకబు చేశారు. బుధవారం సాయంత్రం విధులు ముగించుకుని రాము ఇంటికి బయిల్దేరాడని యజమాని చెప్పడంతో అప్పటి నుంచి వెతకడం ప్రారంభించారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం పుర్రేయవలస సమీపంలో ఇటుకల తయారీ కేంద్రం వద్ద ఉన్న నేలబావి వద్ద చెప్పులు కనిపించడంతో బావిలో చూడగా రాము మృతదేహం కనిపించింది. కుటుంబ భారమో లేక ఇతర కారణాలు ఉండి ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చునని పోలీసులు భావిస్తున్నారు. తండ్రి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎల్.దామోదరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దీపావళిలోగా పదోన్నతులు ఇవ్వాలి

విజయనగరం అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతుల విషయంలో ప్రభుత్వం జాప్యం కొనసాగిస్తోందని, దీపావళి పండుగలోగా పదోన్నతుల జీఓ విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమానికి దిగుతామని ఏపీపీటీడీ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీనరసయ్య హెచ్చరించారు. ఈ మేరకు స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఉత్తరాంధ్ర ఆరు జిల్లాల ఆధ్వర్యంలో జరిగిన జోనల్ కౌన్సిల్ సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దామోదరరావు మాట్లాడుతూ ఆర్టీసీ విలీనమై ఆరేళ్లు గడిచినా ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియ జరపలేదని అసహనం వ్యక్తం చేశారు. అసిస్టెంట్ మెకానిక్ నుంచి అసిస్టెంట్ మేనేజర్ వరకు అలాగే డిపో మేనేజర్ నుంచి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వరకు ఉన్న ఖాళీలను నింపే ప్రక్రియను ప్రభుత్వం ఇప్పటికీ పూర్తి చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 6 వేల మంది ఉద్యోగులు తీవ్ర నిరుత్సాహంలో ఉన్నారని దీపావళి పండగ వరకు సమస్య పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీనరసయ్య మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బంది తక్కువ, బస్సులు తక్కువ, అధిక ప్రయాణికుల సేవల నేపథ్యంలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిపై ఒత్తిడి తీవ్రంగా ఉందన్నారు.

దివ్యాంగులకు మళ్లీ పరీక్ష

- ఏళ్ల తరబడి ధ్రువీకరణ ఉన్నా ఆగని వేధింపులు
- దాగి ఉన్న ప్రభుత్వం కుట్ర



పింఛన్‌ను నిలిపివేశారంటూ పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో కలిసి కలెక్టరేట్‌కు వచ్చి నిరసన వ్యక్తం చేసిన దివ్యాంగులు(ఫైల్)

పార్వతీపురం రూరల్: పుట్టుకతోనో, ప్రమాదవశాత్తుగానో వైకల్యంతో జీవచ్ఛవాలుగా బతుకులు ఈడుస్తున్న విధి వంచితులు వారు. వారికి ప్రభుత్వం పింఛన్ రూపంలో అందించే సాయం గంజినీళ్లకన్నా తక్కువే. కానీ ఆ కొద్దిపాటి ఆసరాను అందుకోవడానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారు నిత్యం అగ్నిపరీక్షలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇప్పటికే ఎన్నోసార్లు పరీక్షల నిమిత్తం వైద్యుల ఎదుట తమ వైకల్యాన్ని నిరూపించుకున్న వారిని, ఇప్పుడు మళ్లీ పునః పరిశీలన పేరుతో ప్రభుత్వ యంత్రాంగం నరకానికి దారులు చూపుతోంది. మళ్లీ పరీక్షకు రండి అంటూ జారీ చేస్తున్న ఆదేశాలు వారి పట్ల పుండుమీద కారం చల్లినట్లుగా మారాయి. ఈ నెల 14 నుంచి పునఃపరిశీలన పేరుతో మళ్లీ పరిశీలన జరగనున్నట్లు 2,484 మందికి హాజరు కావాలని ఇప్పటికే వెలుగు సిబ్బంది ద్వారా సమాచారం ఇచ్చారు. అయితే ఇది సంక్షేమమా? లేక ప్రభుత్వమే దివ్యాంగులను మానసిక క్షోభకు గురిచేయడమా? అని దివ్యాంగులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

అనర్హుల ఏరివేత పేరుతో అసలైన లబ్ధిదారులకు ఘోష

జిల్లా వ్యాప్తంగా అర్హత లేని వారిని ఏరివేసే నెపంతో అధికార యంత్రాంగం చేపట్టిన ఈ పునఃపరిశీలన ప్రక్రియ, అసలైన దివ్యాంగుల పాలిట శాపంగా మారింది. పార్వతీపురం మన్యం జిల్లాలో మొత్తం 2,484 మందిని పునఃపరిశీలన కోసం గుర్తించారు. వారిలో అత్యధికులు 1442 మంది శారీరక వైకల్యం ఉన్నవారే. చేతులు చచ్చుపడి కదలలేని స్థితిలో ఉన్నవారిని సైతం పరిశీలన పేరిట తరలి రావాలనడం ఒక విధంగా ప్రభుత్వ క్రూరత్వానికి నిదర్శనమని దివ్యాంగులు వాపోతున్నారు. దృష్టిలోపం ఉన్నవారు 446మంది, వినికిడి లోపం ఉన్న వారు 511మంది, మానసిక దివ్యాంగులు 85మంది ఈ జాబితాలో ఉన్నారు. వారిలో చాలా మందికి ఏళ్ల క్రితమే జిల్లా ఆస్పత్రుల్లోని వైద్యుల బృందం శాశ్వత వైకల్యం ఉన్నట్లు ధ్రువీకరించి, సదరం సర్టిఫికెట్లు జారీ చేసింది. ఇప్పుడు ఆ పత్రాలకు విలువలేదా? ఆ వైద్యుల నిర్ధారణపై ప్రభుత్వానికి నమ్మకం పోయిందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

పరిశీలన కేంద్రాల్లో నరకయాతన

గతంలో వైకల్య నిర్ధారణ కోసం జిల్లా కేంద్రాలకు, విజయనగరం వంటి ప్రాంతాలకు ప్రయాస పడి వెళ్లిన దివ్యాంగులను ఇప్పుడు మళ్లీ పరిశీలన పేరిట పిలవడం వారికి అగ్నిపరీక్షగా మారింది. ఒకే రోజున వారికి కేటాయించిన సంఖ్యలో పరిశీలనకు వచ్చేవారికి గంటల తరబడి నిరీక్షించక తప్పని పరిస్థితులు అక్కడ ఏర్పడతాయి. ఒకరి సహాయం లేకుండా కదలలేని వారిని ఈ విధంగా పరిశీలన పేరుతో ఇబ్బందులకు గురిచేస్తూ దివ్యాంగులను అవస్థలు పాలు చేయడం ఏ మాత్రం సమంజసం కాదని సామాన్యులు సైతం ప్రభుత్వం తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ తంతంతా చూస్తుంటే అనర్హులను ఏరివేయడం కన్నా, లబ్ధిదారుల సంఖ్యను తగ్గించుకుని ప్రభుత్వం పింఛన్ ఎగవేసేందుకు కుటిల నీతి చేస్తోందన్న విమర్శలు రాజకీయ విశ్లేషకుల నుంచి బలంగా వినిపిస్తున్నాయి.

దివ్యాంగుల పట్ల ప్రభుత్వ తీరు సరికాదు



దివ్యాంగుల పట్ల పునఃపరిశీలన పేరుతో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరికాదు. కనీస మానవతా దృక్పథంతోనైనా ఆలోచించాలి. ఇప్పటికే ధ్రువీకరణ పొందిన శాశ్వత వైకల్యం ఉన్న వారిని ఈ పునఃపరిశీలన ప్రక్రియ నుంచి మినహాయించాలి. నిజంగా అనర్హులు ఉన్నారని భావిస్తే క్షేత్రస్థాయిలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. అంతేగాని ఇష్టానుసారం పరిశీలన పేరిట పరిశీలన కేంద్రాలకు విధివంచితులను ఈ విధంగా రప్పించి వేధించడం సమర్థనీయం కాదు.

– ముల్లు ప్రసాద్, వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగ జిల్లా అధ్యక్షుడు, పార్వతీపురం మన్యం

డీపీఓలో పోలీస్ వెల్ఫేర్ డే

- సమస్యలు ఏకరువు పెట్టిన సిబ్బంది

విజయనగరం క్రైమ్ : జిల్లా ఎస్పీగా ఎ.ఆర్.దామోదర్ బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా తన చాంబర్‌లో శుక్రవారం పోలీస్ వెల్ఫేర్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం పది మంది సిబ్బంది తాము అనుభవిస్తున్న, చెప్పుకోలేని, వృత్తి పరంగా, శాఖా పరంగా పడుతున్న బాధలను, సమస్యలను ఫిర్యాదుల రూపంలో వ్యక్త పరిచారు. జిల్లా పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ విజ్ఞాపనలు స్వీకరించి, పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, శాఖ సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు.



తన చాబర్‌లో సిబ్బంది సమస్యలను వింటున్న ఎస్పీ దామోదర్

పోలీసుల సంక్షేమమే ప్రథమ కర్తవ్యం



పోలీసు శాఖ అధికారుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: నిరంతరం ప్రజారక్షణ విధుల్లో నిమగ్నమయ్యే పోలీసు సిబ్బంది సంక్షేమానికి, శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తామని ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో పోలీసు వెల్ఫేర్ డే (గ్రీవెన్స్‌డే) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు స్టేషన్ల పరిధిలో విధులు నిర్వహిస్తున్న వివిధ హోదాల్లోని అధికారులు, సిబ్బంది తమ వృత్తిపరమైన, ఆరోగ్య, వ్యక్తిగత సమస్యలను ఎస్పీకి నేరుగా విన్నవించుకున్నారు. ఈ క్రమంలో వారి సమస్యలను తెలుసుకున్న ఎస్పీ అక్కడికక్కడే కొన్ని సమస్యలకు సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కార మార్గాలు చూపారు. అలాగే మరికొన్ని సమస్యలపై త్వరలోనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీసులు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉన్నప్పుడే మెరుగైన సేవలు అందించగలరని, వారి సంక్షేమానికి ఎప్పుడు అండగా ఉంటామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీ సంతోషికుమార్ తదితరులున్నారు.

పత్తి రైతు నష్ట పోకుండా చూడాలి

- జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్

విజయనగరంఫోర్ట్: జిల్లాలోని ఏ ఒక్క పత్తి రైతూ నష్ట పోకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్ లోని తన చాంబర్‌లో పత్తి కొనుగోళ్లపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి రైతు సాగు చేసిన పంటను కచ్చితంగా ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని సూచించారు. పత్తికి మద్దతు ధర ప్రభుత్వం క్వింటాకు రూ.8,110 నిర్ణయించిందని చెప్పారు. ఈ విషయాన్ని ప్రచారం చేయాలన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాలు త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కిసాన్ మొబైల్ యాప్‌ను రైతులు ముందుగా డౌన్ లోడ్ చేసుకుని రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. సమావేశంలో మార్కెటింగ్ ఎ.డి బి. రవికిరణ్, డీఎఫ్ఓ రాంప్రకాష్, వెహికల్ ఇన్‌స్పెక్టర్ దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం కేసు నమోదు

కొత్తవలస: మండల కేంద్రంలోని సబ్బవరం రోడ్డులో ఒక వీధిలో మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు వంద రూపాయల కోసం ఘర్షణ పడగా కత్తితో దాడి చేసిన ఘటనలో రవితేజ అనే వ్యక్తిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఎస్.షణ్ముఖరావు శుక్రవారం తెలిపారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 7వ తేదీన సూరిశెట్టి రవితేజ, జంగంపల్లి ప్రసాద్ కలిసి మద్యం తాగారు. మద్యం మత్తులో ఉన్న ప్రసాద్ నుంచి రవితేజ వంద రూపాయలను లాక్కున్నాడు. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ ఏర్పడి ఒకరిని ఒకరు కొట్టుకున్నారు. ఈ క్రమంలో కూరగాయలు కోసే కత్తితో ప్రసాద్‌ను బలంగా రవితేజ పొడిచి తీవ్రంగా గాయపర్చాడు. స్థానికులు విడిపించగా ప్రసాద్‌ను కుటుంబసభ్యులు విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం ప్రసాద్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రవితేజను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.


ఉపాధ్యాయురాలి ఆత్మహత్య




ఆత్మహత్యకు పాల్పడిన ఉపాధ్యాయురాలు కనకలక్ష్మి

నెల్లిమర్ల రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఆత్మహత్యకు పాల్పడింది. నెల్లిమర్ల మండలంలోని మొయిద గ్రామంలో గురువారం సాయంత్రం జరిగిన ఈ ఘటనపై ఎస్సై గణేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కవల కనకలక్ష్మి (42) గుర్ల మండలంలోని పెనుబర్తి ప్రభుత్వ పాఠశాలలో ప్రస్తుతం ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్నారు. సుమారు పదేళ్ల నుంచి పక్షవాతం సమస్యతో ఆమె బాధపడుతున్న నేపథ్యంలో మనస్తాపానికి గురై గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. బయటకు పొగలు రావడంతో గమనించిన స్థానికులు ఇంట్లోకి వెళ్లి చూడగా కుర్చీలో అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను గమనించి 108కు సమాచారం అందించారు. తీవ్ర గాయాలపాలైన ఆమెను విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి భర్త నక్కిన శ్రీనివాసరావు కూడా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగానే పనిచేస్తున్నారు. వారికి ఒక కుమార్తె ఉంది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై గణేష్ శుక్రవారం తెలిపారు.

అంతరిక్షంలో జీవనం సాధ్యమే



ధృవపత్రాలతో విద్యార్థులు,నిర్వాహకులు



నమూనాతో నిర్వాహకులు

బొబ్బిలి: మన ప్రయోగాలు, పరిశోధనల సారాంశం సరికొత్త దశలోకి వెళ్తోందని, ఇప్పుడు అంతరిక్షంలో ప్రయాణమే కాదు అక్కడ మానవ జీవనమూ సాధ్యమేనన్న రీతిలో సరికొత్త ఆవిష్కరణలు భవిష్యత్తులో జరగనున్నాయని శ్రీహరి కోట మూడవ లాంచ్ ప్యాడ్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.శ్రీనివాస రావు అన్నారు. గడిచిన మూడు రోజులుగా స్థానిక రాజా కాలేజీలో ఇస్రో ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అంతరిక్షంలో మన ప్రయోగాలు, పరిశోధనల విషయమై స్థానిక విలేకర్లతోనూ మాట్లాడారు. నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ తొలిసారి చంద్రమండలంపై అడుగుపెట్టినప్పుడు చెప్పిన ఈ చిన్న అడుగే పెద్ద దూకుడవుతుందన్న మాటలు ఇప్పుడు నిజమవుతున్నాయన్నారు. మనదేశం కూడా ఈ రంగంలో అసాధారణ ప్రయాణం చేస్తోందన్నారు. 1969లో చిన్న ఆఫీసులో ప్రారంభమైన ఇస్రో ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత నమ్మదగిన అంతరిక్ష సంస్థ అయిందన్నారు. మన చంద్రయాన్ మిషన్లు చంద్రుడిపై నీటి ఆనవాళ్లు కనుగొన్నాయని తెలిపారు. మంగళయాన్ మిషన్ రెడ్ ప్లానెట్ చేరిన మొదటి ఆసియా దేశంగా మన దేశాన్ని ముందు నిలిపిందన్నారు. ఆదిత్య-ఎల్1 అనేది సూర్యుడ్ని పరిశీలిస్తూ భూమిని రక్షించే కీలక ఉపగ్రహంగా నిలిచిందన్నారు. ఇప్పుడు గగన్‌యాన్ మన దేశ అంతరిక్ష పరిశోధనను ఎంతో ఎత్తుకు తీసుకెళ్లాయన్నారు. భూమి సహాయం లేకుండా అంతరిక్షంలో శ్వాస తీసుకోవడం, నీరు తాగడం, ఆహారం పొందడం, శక్తిని ఉత్పత్తి చేయడం వంటి ఎన్నో చర్యలను త్వరలో చేపట్టేందుకు అవకాశం ఉందన్నారు. భారత దేశానికి స్వంత అంతరిక్ష కేంద్రం (భారతీయ అంతరిక్ష కేంద్రం)2040 నాటికి సాధ్యపడుతుందన్న భావన వ్యక్తం చేశారు. ఇందుకోసం మన దేశం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. రాజా కళాశాల చైర్మన్ ఆర్‌వీఎస్‌కే రంగారావు మాట్లాడుతూ కాలేజీలో చేపట్టిన ప్రదర్శనలు, ప్రయోగాల నమూనాల ఆధారంగా ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రయోగాల్లో వాటికి సంబంధించిన పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఇస్రో నిర్వాహకులు టి.హరికృష్ణ, ఈ ప్రదీప్‌నాయుడు, ప్రిన్సిపాల్ సీహెచ్ వీరేంద్రకుమార్, అధ్యాపకులు, వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పెదమానాపురం గ్రామస్తుల ధర్నా



జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న పెదమానాపురం గ్రామస్తులుఅ

- ఆర్ఓబీ పూర్తవడంతో రాకపోకలకు ఇబ్బందులు
- కిలోమీటర్ నడిచి బస్సులు ఎక్కాల్సి వస్తోందని ఆవేదన
- అండర్‌గ్రౌండ్ వంతెన సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం గ్రామస్తులకు రాక పోకలకు ఇబ్బందులు కలగడంతో శుక్రవారం ఉదయం పోలీస్ స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై గ్రామస్తులు అంతా కలిసి ధర్నా నిర్వహించారు. కిలోమీటర్ మేర వాహనాలను నిలుపుదల చేసి వారు పడుతున్న బాధలను తెలియజేశారు. అనంతరం సీఐటీయూ నాయకురాలు లక్ష్మీతో కలిసి గ్రామస్తులు కనకరాజు, రామప్పలనాయుడు, ఆదినారాయణ, పైడిరాజు, సత్యారావు, సంజీవి, వెంకటరమణ, రాకేష్, రామునాయుడు మాట్లాడుతూ పిల్లలు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాలంటే కష్టంగా ఉందని కిలోమీటర్ దూరం నడిచి వచ్చినా బస్సులు ఆపడం లేదని, ఎరువులు పట్టుకుని పొలాలకు వెళ్లాలన్నా ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోందని వాపోయారు. తక్షణమే అధికారులు దృష్టి సారించి అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న గ్రామానికి చెందిన జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి మాట్లాడుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామం నుంచి కిలోమీటర్ దాటి వెళ్లినా బస్సులు ఆపక పోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని రాత్రి సమయంలో పోలీస్‌స్టేషన్ దాటి బస్సులు ఆపడం వల్ల ఎవరికి ఏ అపాయం జరుగుతుందోనని ఆందోళనలో ఉన్నామన్నారు. పెదమానాపురం గ్రామాన్ని దత్తత తీసుకున్నానని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్న స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తక్షణమే స్పందించి గ్రామస్తులకు దారి చూపించాలని కోరారు.

రైతుపై టీడీపీ వర్గీయుల దాడి

- అత్యవసర వైద్యం కోసం విజయనగరం తరలింపు



చికిత్స పొందుతున్న ఆదినారాయణ

చీపురుపల్లి: అధికార పార్టీ అండతో టీడీపీ వర్గీయులు ఇష్టారాజ్యంగా దాడులకు తెగబడుతున్నారు. పంట పొలాల్లో వచ్చిన తగాదాలపై అక్కడితో ఆగకుండా ఇళ్లకు వెళ్లి మరీ దాడులకు పాల్పడుతున్నారు. సరిగ్గా ఇదే సంఘటన చీపురుపల్లి మండలంలోని నిమ్మలవలస పంచాయతీ మధుర గ్రామమైన గుణిదాంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి గాయడిన బాధితుడి కుటుంబ సభ్యులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గుణిదాం గ్రామానికి చెందిన గండబోయిన ఆదినారాయణకు ఎర్ర సురేష్‌కు మధ్య పొలంలో గట్టు వివాదం నెలకొంది. పొలంలో ఇరు వర్గాల మధ్య గొడవ జరిగిన అనంతరం సమసిపోయింది. అయితే కక్ష పెట్టుకున్న ఎర్ర సురేష్, మరికొంత మందితో కలిసి కత్తులు, రాడ్లతో అధికార పార్టీ అండతో సాయంత్రం గండబోయిన ఆదినారాయణ ఇంటికి వెళ్లి విచక్షణా రహితంగా దాడికి తెగబడ్డారు. ఈ ఘటనలో ఆదినారాయణ తలపై తీవ్ర గాయాలయ్యాయి. రక్తపు మడుగులో ఉన్న ఆదినారాయణను కుటుంబ సభ్యులు చీపురుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. దీంతో అక్కడ ప్రథమ చికిత్స అందించిన వైద్యులు అత్యవసర చికిత్స కోసం విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అయితే ఈ వివాదంలో తమకు గాయాలయ్యాయంటూ ఇరు వర్గాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్.దామోదరరావు చెప్పారు.

తండ్రిని చంపిన కేసులో తనయుడి అరెస్టు



హత్యకేసు నిందితుడితో డీఎస్పీ. భవ్యరెడ్డి, సీఐ నారాయణరావు, ఎస్సై తారకేశ్వరరావు

బాడంగి: మండలంలో సంచలనం రేపిన తండ్రిని చంపిన తనయుడి హత్యకేసును పోలీసులు ఛేదించారు. తండ్రి హత్యకు కారణమైన కుమారుడు బోనుగిరి లక్ష్మణరావును శుక్రవారం అరెస్టుచేసి రిమాండ్ నిమిత్తం బొబ్బిలి కోర్టుకు తరలించారు. దీనికి సంబంధించిన వివరాలను డీఎస్పీ భవ్యరెడ్డి విలేకరులకు వెల్లడించారు. మద్యానికి బానిసగా మారి డబ్బులకోసం తరచూ తండ్రితో లక్ష్మణరావు గొడవ పడుతుండేవాడని చెప్పారు. ఈ క్రమంలో బుధవారం రాత్రినుంచి కీచులాట పెట్టుకున్నా ససేమిరా డబ్బులిచ్చేది లేదని తండ్రి చెప్పడంతో చెప్పుల మేకులు చెరిచే గూటంతో గురువారం తెల్ల వారుజామున తండ్రి రాజేశ్వరరావు కుడి చెవిపై బలంగా కొట్టడంతో రక్తస్రావం జరిగి తండ్రి అక్కడికక్కడే మృతి చెందినట్లు చెప్పారు. నిందితుడిని పిన్నవలస జంక్షన్‌లో పట్టుకుని అరెస్టు చేశామని తెలిపారు. బొబ్బిలిరూరల్ సీఐ. నారాయణరావు, ఎస్సైతారకేశ్వరరావుల కృషిని ఆమె అభినందించారు.

చిన్నా... లే నాన్నా..

- ఆడుకునేందుకు వెళ్లి అనంత లోకాలకు..
- విద్యుదాఘాతంతో బాలుడు మృతి
- కన్నీరుపెట్టిన తల్లిదండ్రులు
- పంచాయతీ, విద్యుత్‌శాఖ నిర్లక్ష్యానికి బాలుడు బలయ్యాడంటూ బంధువుల ఆరోపణ
- శోకసంద్రంలో ఎస్.పెద్దవలస ఎస్సీ కాలనీ



బాలుడు మృతి చెందడంతో కన్నీరు మున్నీరవుతున్న తల్లిదండ్రులు, బంధువులు

మక్కువ: చిన్నా.. లే నాన్నా... ఆడుకుని వస్తానని చెప్పి అనంత లోకాలకు వెళ్లిపోయావా... అప్పుడే నూరేళ్లు నిండిపోయాయా.. మాతో ఎవరు ఆడుకుంటారు... వేగంగా వచ్చేస్తానన్నావు... మమ్మల్ని విడిచిపెట్టి వెళ్లిపోయావా అంటూ చిన్నారి తల్లిదండ్రులు రోదించిన తీరు అక్కడివారిని కన్నీరుపెట్టించింది. అన్నం పెట్టమ్మా.. తిని కాసేపు ఆడుకొని వచ్చేస్తానంటూ బయటకు వెళ్లిన చిన్నారి విద్యుదాఘాతంతో మృతిచెందడం కుటుంబ సభ్యులు, గ్రామస్తుల్లో విషాదం నింపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...

మక్కువ మండలం ఎస్.పెద్దవలస ఎస్సీ కాలనీకు చెందిన కల్లుకోట రమ్య, చందుల కుమారుడు అభీరా(4) శుక్రవారం ఉదయం ఆడుకునేందుకు మరో స్నేహితుడితో కలిసి వెళ్లాడు. రెండు గంటల సమయం దాటినా ఇంటికి చేరుకోకపోవడంతో తల్లి రమ్య వెతకసాగింది. అభీరాతో ఆడుకునేందుకు వెళ్లిన మరో బాలుడిని బిడ్డ ఆచూకీ కోసం ఆరా తీసింది. పాఠశాల వైపు వెళ్లాడని ఆ బాలుడు సమాధానం చెప్పడంతో అటువైపుగా వెళ్లిన ఆ తల్లి పాఠశాల ప్రహరీ పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్న బిడ్డను చూసి తల్లడిల్లిపోయింది. కేకలు వేస్తూ బిడ్డను హత్తుకునే ప్రయత్నంలో ఆమెకు కూడా విద్యుత్‌షాక్ తగలడంతో కాలనీ వాసులు రక్షించారు. లేదంటే తల్లి కూడా బిడ్డతో పాటు మృతి చెందేది. కాలనీకి తాగునీరు సరఫరా చేసే రక్షిత మంచినీటి పథకం విద్యుత్ ప్యానల్‌బోర్డును పాఠశాల ప్రహరీకి అమర్చారు. దాని పక్కనే జామి చెట్టు ఉంది. చెట్టుకాయలు తెంపేందుకు చిన్నారి వెళ్లాడా? లేదంటే అక్కడ ఆడుకుంటుండగా విద్యుత్‌షాక్ తగిలిందో తెలియదు.. విగతజీవిగా కనిపించాడు. కొడుకు మృతిచెందిన విషయం తెలుసుకున్న తండ్రి చందు విశాఖపట్టణం నుంచి హుటాహుటిన చేరుకున్నాడు. నాన్న, చిన్నా లేవరా.. నాతో ఎవరు ఆడుకుంటారు.. లే..నాన్న అంటూ తండ్రి రోదన అందరి కంట కన్నీరు తెప్పించింది. పోస్టుమార్టం కోసం ఆటోలో తరలిస్తున్న బాలుడిని పట్టుకొని ఆ తండ్రి కన్నీరుమున్నీరయ్యారు.



పోస్టుమార్టం కోసం ఆటోలో తరలిస్తున్న కుమారుడిని చూసి కన్నీరుపెడుతున్న తండ్రి

పంచాయతీ, విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యానికి బాలుడు బలి?



ప్రమాదానికి కారణమైన ప్యానల్‌బోర్డు

గ్రామంలో ఎస్సీ కాలనీకు తాగునీరు అందించేందుకు మినీ రక్షిత మంచినీటి పథకం ఏర్పాటుచేశారు. తాగునీరు సరఫరా చేసేందుకు పాఠశాల ప్రహరీకి అమర్చిన ప్యానల్ బోర్డు కింద వైరు పాడవ్వడంతో ప్యానల్ బోర్డుకు విద్యుత్ సరఫరా అవుతోంది. కాలనీ వాసులు నిత్యం కర్రలతో స్విచ్ ఆన్, ఆఫ్ చేసి తాగునీరు పట్టుకుంటున్నారు. ఈ విషయం పలుమార్లు పంచాయతీ అధికారులకు తెలియజేసినా పట్టించుకోకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. బాలుడు అభీరా విద్యుత్ షాక్‌తో మృతి చెందిన విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ స్తంభంపై ఉన్న వైరును తొలగించి, వారిపై ఎటువంటి అపనింద పడకుండా చేసిన ప్రయత్నాలను కాలనీ వాసులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, ప్రమదానికి గల కారణాలు తెలుసుకున్నారు. కేసు నమోదుచేసి, బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.